‘డబుల్’ కల నెరవేరేదెప్పుడో?

- లబ్ధిదారుల ఎదురుచూపులు
- పత్తాలేని కాంట్రాక్టర్
- చోద్యం చూస్తున్న అధికారులు


నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పనులు

రాయికల్: ‘దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్న చందంగా మారింది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. నిరుపేదలకు గూడు కల్పించేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్‌రూం పథకం రాయికల్ పట్టణంలోని లబ్ధిదారులకు మాత్రం అందని ద్రాక్షగా మారింది. 2016 ఫిబ్రవరిలో నిరుపేద లబ్ధిదారులను 60 మందిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. కానీ ఇప్పటివరకు వాటి నిర్మాణం పూర్తి కాలేదు. రాయికల్ పట్టణ శివారులోని ఎకరం భూమిలో 60 మంది లబ్ధిదారుల కోసం జీప్లస్–1తో ఇళ్ల పనులను చేపట్టారు. ఏడేళ్లు అయినప్పటికీ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు ఎప్పుడు డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్తామోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

పత్తాలేని కాంట్రాక్టర్..

పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం జగిత్యాలకు చెందిన మధుసూదన్ అనే కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. దక్కించుకున్న కాంట్రాక్టర్ కాక మరో వ్యక్తికి కాంట్రాక్ట్ పనులను అప్పగించారు. ఆ ఇన్‌చార్జి కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే పనులను వదిలివెళ్లడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ రవి స్పందించి నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



లక్కీడిప్‌లో నా పేరు రాగానే మొదట సంబరపడ్డాం. సంవత్సరంలో పూర్తిచేస్తామన్న నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడంతో మాలాంటి నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందని ద్రాక్షగా మారుతున్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి.

– శాంత, లబ్ధిదారురాలు

పనులు పూర్తి చేయిస్తాం



రాయికల్ పట్టణంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షణలో పనులు నడిచేవి. ఇటీవల కాలంలో పంచాయతీరాజ్‌కు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు కూడా మేము తీసుకోలేదు. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకుచ్చి పనులు చేపట్టేలా చూస్తాం.

– ప్రసాద్, ఏఈ,పంచాయతీరాజ్

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందినబీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గౌడసంఘం అధ్యక్షుడు బందెల నర్సయ్యగౌడ్ తల్లి బందెల లక్ష్మి గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన చికిత్స చేయించుకోలేని పరిస్థితులో ఉంది. వారి సమస్యను మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి స్వయంగా వారి ఇంటికి వచ్చి బాధితురాలిని పరామర్శించి, హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో ఆమెకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ లెటర్‌ను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పల్లె దవాఖాన భవనం కోసం స్థలం పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న బాపురెడ్డి,నాయకులు

కథలాపూర్: మండల కేంద్రంలో పల్లె దవాఖాన భవనం నిర్మాణానికి మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. పల్లె దవాఖానకు భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ స్థలం లేక జాప్యం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. దీంతో స్థానిక నాయకులతో చర్చించి కథలాపూర్‌లో కమాన్ వద్ద స్థలం అనుకూలంగా ఉంటుందని నిర్ణయానికి వచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు గుండారపు గంగాధర్, నాగేశ్వర్‌రావు, బద్దం మహేందర్, పంబాల లక్ష్మణ్, కల్లెడ శంకర్, బావు గంగాధర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక


కొక్కుల మణికంఠ

జగిత్యాలటౌన్: ఈనెల 28 నుంచి 30 తేదీ వరకు హైదరాబాద్ యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు జగిత్యాల మౌంట్‌కార్మెల్ పాఠశాల విద్యార్థి కొక్కు మణికంఠ ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, పీఈటీలు మంగమ్మ, విజ్ఞాన్,సామంత్, హరీష్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థి మణికంఠను అభినందించారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ‘ఆవో గావ్ చలో’


కల్లూర్ వైద్యశిబిరంలో ఐఎంఏ వైద్యులు

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్‌లో ఆదివారం ‘ఆవో గావ్ చలో’ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల ఐఎంఏ ఆధ్వర్యంలో కల్లూర్‌ను దత్తత తీసుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ల బృందం 250 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనగడుపుల అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, ఐఎంఏ కోరుట్ల అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేశ్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, సీనియర్ డాక్టర్లు అనూప్‌రావు, విజయ్ కుమార్, మహదేవ్, సంపత్ కుమార్, ఇంద్రనీల్, నరేశ్, రవికిరణ్, రమేశ్, మనోజ్, మహిళా డాక్టర్లు శ్రీలత, అనురాధ, దీప్తి, పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్ల ధర్మారం ప్రభుత్వ పాఠశాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ నారపాక రమ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గారం: మండలంలోని సిరికొండలో ఐఎంఏఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్యసేవలు అభినందనీయం


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు బీపీ చెక్ చేస్తున్న వైద్యులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ పిలుపు మేరకు ‘ఆవో..గావో..చలో’ మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యులు తమ వృత్తిలో బిజీగా ఉన్నా.. స్వచ్ఛంద సేవలు అందించేందుకు సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ నవీన్, డాక్టర్ స్వాతి, సర్పంచ్ మహేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు, ఎంపీటీసీ పర్శరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్ నాయకులు

మల్లాపూర్: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ముదిరాజ్ నాయకులు ఆదివారం ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శవయాత్రగా తీసుకొచ్చి దహనం తెలంగాణ ముదిరాజ్ యువత జిల్లా అధ్యక్షుడు ఊరుమాడ్ల చరణ్, మహాసభ మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతు ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలని, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షుడు ఉసికెల చిన్నయ్య, ఉమ్మడి వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ఆర్టీసీ సేవలు


సేవలు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

పెగడపల్లి: ప్రజలకు తమ సేవలను మరింత చేరువ చేయడం కోసం తెలంగాణ ఆర్టీసీ వినూత్న కార్యక్రమం చేపట్టిందని విలేజీ ఆర్టీసీ బస్ ఆఫీసర్ కాటం రామకృష్ణారెడ్డి అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని బతికపల్లి గ్రామాల్లో విలేజీ ఆర్టీసీ బస్ ఆఫీసర్ సేవలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సేవలతో గ్రామాల్లో ప్రజలతో సంబంధాలు పెంచుకుని వారి సమస్యలను తమ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వివాహాలు, శుభకార్యాలకు అద్దె బస్సుల బుకింగ్, కార్గో సేవలు, తిరుమల శ్రీవారి దర్శన సదుపాయాలు, విద్యార్థులకు ఉచిత బస్ పాసులు, సురక్షితమైన ప్రయాణం తదితర అంశాలపై ప్రజలకు విలేజీ ఆఫీసర్ కేఆర్‌కే రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు మేరుగు శ్రీనివాస్, తాటిపర్తి శోభారాణి, ఎంపీటీసీలు జమున, అనసూర్య, లచ్చయ్య, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఆర్థికసాయానికి 799 దరఖాస్తులు

కథలాపూర్: బీసీలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం మేడిపెల్లి మండలంలో 799 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ ఖయ్యూం ఆదివారం తెలిపారు. దరఖాస్తు దారుల వివరాలు గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులకు అందించామన్నారు. దరఖాస్తులో నమోదు చేసిన సర్టిఫికెట్లు పరిశీలించి నివేదిక తయారు చేయాలని కార్యదర్శులకు ఆదేశాలిచ్చామన్నారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన


మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సృజన

జగిత్యాలటౌన్: పట్టణంలోని మార్కండేయనగర్‌లో సృజనా దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో నియోజకవర్గంలోని దాదాపు వంద మందికి పైగా దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ గతంలో కూడా ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. దంతాల సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అత్యధిక వేడి లేదా చల్లని పదార్థాలను ఉపయోగించరాదన్నారు. తంబాకు, గుట్కాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తద్వారా నోటి క్యాన్సర్‌లాంటి ప్రమాదకర జబ్బుల నుంచి రక్షణ పొందాలన్నారు. పళ్లు ఆరోగ్యంగా ఉంటేనే నోరు ఆరోగ్యంగా ఉంటుందని నోటితో పాటు ముఖ సౌందర్యానికి ఆధారం పళ్లేనని వాటిని సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. పళ్ల ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని సంరక్షించుకోవాలని అవసరమైనప్పుడు దంతవైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం..


బాదనకుర్తి వంతెనపై కూలిపోయిన సైడ్‌వాల్

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ శివారులో నిర్మల్–జగిత్యాల, మెట్‌పల్లి–ఖానాపూర్ ప్రధాన రహదారులు కలిగిన బాదనకుర్తి వంతెనపై సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. రెండు జిల్లాలను కలిపే ఈ వంతెనపై నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. వంతెన సైడ్‌వాల్ కూలిపోయి ఉండడంతో వాహన చోదకులతో పాటు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై కూలిన సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేయించాలని సామాజిక కార్యకర్త, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్ డిమాండ్ చేశారు.

నిరుపేదల కోసమే వైద్యశిబిరాలు


ముత్యంపేటలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మల్లాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల కోసం గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎస్సై నవీన్‌కుమార్, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ ఉషాకిరణ్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని వైస్ ఎంపీపీతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యకరమైన సమాజంతోనే దేశాభివృద్ధి చెందుతుందని, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం సామాజిక బాధ్యతగా తీసుకుంటుందన్నారు. వైద్యులు 130 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మరో 40 మందికి శస్త్ర చికిత్స కోసం కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కోట జీవన్, సర్పంచ్ బోల్లం కృష్ణవేణి, ఉపసర్పంచ్ అల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాదుల్ల వెంకటస్వామి,తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కోరుట్ల రూరల్: పట్టణంలోని మహాత్మా విద్యాలయంలో 1997–98 లో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం సిల్వర్ జూబ్లి ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అందుకు మండలంలోని వెంకటాపూర్ గుట్ట వేంకటేశ్వర ఆలయ ఆవరణ వేదికైంది. అందరూ ఒకే చోట కలుసుకుని పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన తమ బ్యాచ్ స్నేహితులకు, ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. గురువులను సన్మానించి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కిరణ్, పరమేశ్వర్, రాజు, రఘువరన్, రహీం, రాజేంద్రప్రసాద్, ప్రవీణ్, అశోక్, ధనుంజయ్,సునీత, మానస, రూప, కవిత, అర్చన, స్వప్న పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు


కోరుట్ల మండలం అయిలాపూర్ బోనాలతో వస్తున్న మహిళలు

మెట్‌పల్లి: పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ బోనాల జాతరను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పెద్దమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కౌన్సిలర్ యామ రాజయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. వేడుకల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సతీమణి సరోజన, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ రాణవేణి సుజాత ,మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ పోగుల ఉమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లిలో పెద్దమ్మ తల్లి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్‌లో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలిశెట్టి రవి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలో మహిళలు బోనాలు ఎత్తుకుని, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లి, పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎల్లాల జనార్దన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో ఆదివారంఎస్సీ మహిళలు పోచమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు.డప్పు చప్పుళ్లతో వెళ్లి అమ్మవారికి ప్రసాదాలను, బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పెద్దన్న భీమన్న దేవుడి మొక్కులు

గొల్లపల్లి: మండల కేంద్రలో మల్లికార్జున స్వామి యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దన్న,భీమన్న దేవుళ్లకి ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వయోధికులకు ప్రభుత్వం ఆసరా


మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జగిత్యాల:సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, రక్షణ కోసం ప్రభుత్వం ఆసరాగా ఉందని, వయోధికుల సంరక్షణ చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ప్రపంచ వయోధికుల వేధింపుల నివారణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వయోధికుల రక్షణ, పోషణ, సంక్షేమ చట్టం అనే అంశంపై వివిధ సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

భగవద్గీతపై ప్రచారం

ధర్మపురి: మండలంలోని రాజారంలో ,ఆదివారం త్రైత సిద్ధాంత గ్రంథాలను, జ్ఞాన ధర్మ ప్రచారాన్ని చేశారు. ఆషాఢమాసంలో వచ్చే గురుపౌర్ణమి పురస్కరించుకుని జగిత్యాల జిల్లా త్రైతసిద్ధాంతకర్త ప్రబోధానంద ఆశీస్సులతో లక్సెట్టిపేట, కొడిమ్యాల సేవాసమితి వారి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి గ్రంథాలను పంపిణీ చేసారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు ఆర్ రాజు, రాకేశ్, ఎం రాజు, విక్రమ్ దీక్షిత్, సునిత, రవళి, స్వాతి, ఉమా, సంధ్యారాణి తదితరులున్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్‌లో కలమడుగు గంగవ్వ వెంకయ్య జ్ఞాపకార్థం కలమడుగు నరేందర్ సుస్మిత గార్ల సహకారంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాసులు అందజేశారు.

గోమాత షెడ్డు నిర్మాణానికి ఆర్థికసాయం

రాయికల్: పట్టణంలోని శివాలయంలో గోమాతల షెడ్డు నిర్మాణం కోసం ఆదివారం శ్రీరక్షసేవా సమితి సభ్యులు రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొత్తపెల్లి గంగాధర్, సభ్యులు బూర్లదేవదాస్ నరేశ్, గంగాధర్, సిద్ధంశెట్టి శశికుమార్, రాజన్న, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ..

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కర్రె జగదీశ్ కుటుంబానికి యువసేన యూత్ సభ్యులు అండగా నిలిచారు. ఆదివారం బాధిత కుటుంబానికి యువసేన యూత్ సభ్యుడు పోరండ్ల కౌశిక్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మారిశెట్టి మహేశ్, సబావత్ మల్లేశ్, ఆకుల రవి, గణేష్, చంద్రశేఖర్, సతీష్, మహేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా రాజేశ్వరి


రాజేశ్వరి

కొండగట్టు: మహిళా కాంగ్రెస్ కొడిమ్యాల మండల అధ్యక్షురాలుగా కొడిమ్యాలకు చెందిన ఎంపీటీసీ జమల్‌పూరి రాజేశ్వరిని నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం సూచనల నియామకపత్రాన్ని రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగ్జీవన్‌రామ్ మాదిగ సంక్షేమ సంఘం నూతన కమిటీ


నూతన కార్యవర్గ సభ్యులు

గొల్లపల్లి: బాబు జగ్జీవన్‌రామ్ మాదిగ సంక్షేమ సంఘం గొల్లపల్లి నూతన కమిటీ సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాండ్ర కిరణ్, గౌరవ అధ్యక్షుడిగా జేరిపోతుల కొంరయ్య, ఉపాధ్యక్షులుగా దావుల రాకేష్ కుమార్, తడగొండ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నలువాల అంజయ్య, కార్యదర్శిగా నలువాల రమేశ్, కోశాధికారిగా కాంపెల్లి రమేశ్, సలహాదారుగా గంగాధర మదూసుధన్, ముఖ్య సలహాదారుగా తాండ్ర రాజయ్యను ఎన్నుకున్నారు.

సమాచారం..

నేడు రాయికల్‌లో జగన్నాథ రథయాత్ర

రాయికల్: పట్టణంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రమేశ్, నరేందర్ ఆదివారం తెలిపారు. భీమన్న గుడి నుంచి గాంధీచౌక్, పటేల్ విగ్రహం, శివాజీ విగ్రహం, గుడికోట వరకు రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.